

నూజివీడుపైనే మోజు

రాష్ట్రంలోని ట్రిపుల్ ఐటీల్లో మిగిలిన వాటి కంటే నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు కోసమే అధికశాతం విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. 8లో ▸



లారీని ఢీకొన్న బస్సు

పెదపాడు మండలం కలపర్రు వద్ద హైవేపై ఆగి ఉన్న లారీని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొన్న ఘటనలో వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందింది. 8లో ▸



లంక గ్రామాల్లోకి మళ్లీ వరద

లంక గ్రామాల్లో గోదావరి వరద మళ్లీ పెరుగుతోంది. కనకాయలంక, పెదలంక, లక్ష్మీపాలెం, బాడవ గ్రామాలలో శుక్రవారం రోడ్లను నీరు ముంచెత్తింది. 8లో ▸

న్యూస్‌రీల్

డిపార్ట్‌మెంట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు



ఏపీపీఎస్సీ పరీక్షల నిర్వహణపై అధికారులతో మాట్లాడుతున్న డీఆర్వో

భీమవరం: ఏపీపీఎస్సీ నిర్వహించే డిపార్ట్‌మెంట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు చెప్పారు. శనివారం కలెక్టరేట్‌లోని డీఆర్వో చాంబర్‌లో పరీక్షల నిర్వహణపై సెక్షన్ ఆఫీసర్ పద్మా లలిత, పోలీసు, విద్యుత్, వైద్య శాఖ, పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, లైజన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఈ నెల 28, 30 తేదీల్లో నిర్వహించే పరీక్షలకు 856 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. భీమవరంలో డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాల, అటానమస్ క్యాంపస్‌లు, తాడేపల్లిగూడెంలోని శ్రీవాసవి ఇంజనీరింగ్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరీక్షా కేంద్రాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా జనరేటరు కూడా సిద్ధం చేసుకోవాలన్నారు.

వరద సహాయక చర్యలకు సన్నద్ధంగా ఉండాలి

భీమవరం: గోదావరి వరద ఉధృతి, ముందస్తు చర్యలపై వివిధ శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో కలెక్టరు నాగరాణి శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టరు వరద ఇంకా కొనసాగుతున్న దృష్ట్యా అధికారులు అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. లంక గ్రామాల ప్రజలకు భోజన వసతి, తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించి కాపాడాలన్నారు. ఏటిగట్లు బలహీనంగా ఉన్నచోట ఇసుక బస్తాలు, సర్వే బాదులు, తదితర సామాగ్రిని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఏటిగట్టును నిరంతరం పరిశీలన చేస్తుండాలని, బలహీనంగా ఉంటే యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయాలని కలెక్టరు ఆదేశించారు. గజ ఈతగాళ్లు, లైఫ్ జాకెట్లు సిద్ధంగా ఉంచాలన్నారు. వరద అదుపులోకి వచ్చాక అంటువ్యాధులు ప్రబలకుండా వైద్యఆరోగ్య శాఖ అవసరమైన మందులు సిద్ధంగా ఉంచాలన్నారు. నెలలు నిండిన గర్భిణీ స్త్రీలు, బెడ్ రెస్టు పేషెంట్లను దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికిలో జాయిన్ చేయాలని, ఇంకా ఒకటి, రెండు కేసులు ఎక్కడయినా ఉంటే వెంటనే తరలించాలని ఆదేశించారు. పాము కాటు, కుక్క కాటు మందులు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలన్నారు. సమావేశంలో రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు, ఆర్డీవోలు కె.శ్రీనివాసులు రాజు, యం.అచ్యుత అంబరీష్ తదితరులు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ లైన్‌ల పునరుద్ధరణ



అల్లూరినగర్‌లో విద్యుత్ లైన్‌లు పరిశీలిస్తున్న ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ

వేలేరుపాడు: పెద్దవాగు ప్రవాహం వల్ల నీటమునిగిన గ్రామాల్లో తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ శనివారం పర్యటించారు. విద్యుత్ లైన్‌ల మరమ్మతులకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. మేడేపల్లి, అల్లూరినగర్, కోయమాధారం, ఊటగుంపు, గుళ్ళవాయి తదితర గ్రామాల్లో లైన్‌ల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఉద్యాన పంటలకు ఊతం

- గత ఐదేళ్లలో ఉద్యాన వర్సిటీ కొత్త పుంతలు
- కేవీకేలు, ల్యాబ్‌లు, కళాశాలల ఏర్పాటు



వర్సిటీలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సులో నారు సాగు



ఉద్యాన కళాశాల పరిపాలనా భవనం

తాడేపల్లిగూడెం: రాష్ట్రంలో రైతన్న సంక్షేమానికి శ్రీకారం చుట్టిన దివంగత సీఎం వైఎస్.రాజశేఖర రెడ్డి మానస పుత్రికగా ఆవిర్భవించిన ఉద్యాన వర్సిటీ గత ఐదేళ్లలో అనేక కొత్త వంగడాలకు ఊపిరిపోస్తుంది. అధిక దిగుబడులతో పాటు చీడపీడలను తట్టుకొనే వంగడాలకు రూపొందిస్తూ రైతులకు ఎంతో సాయపడింది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో గత ఐదేళ్ల కాలంలో ఈ వర్సిటీ కొత్త పుంతలు తొక్కింది. రెండు కొత్త కృషి విజ్ఞానకేంద్రాలు, ఒక ఉద్యాన కళాశాల, ఒక పరిశోధనశాల గత ఐదేళ్లలో ఏర్పాటయ్యాయి. విత్తనం తెచ్చుకుంటే చాలు వర్సిటీలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలో కేవలం 25 పైసలకే మొక్కను తయారు చేసి ఇస్తారు. అలాగే దేశ, విదేశాలకు చెందిన ఎందరో విద్యార్థులకు మార్గనిర్దేశనం చేసింది.

జీన్ బ్యాంకుల ఏర్పాటు

మేలైన జాతులు అంతరించిపోకుండా ఆయా పంటలకు సంబంధించి ఉద్యానవర్సిటీ పరిధిలో జీన్ బ్యాంకులు ఏర్పాటుచేశారు. కడప జిల్లా అనంతరాజుపేటలో మ్యాంగో జీన్ బ్యాంక్, పందిరిమామిడిలో పామ్ జీన్ బ్యాంకు, అంబాజీపేటలో కోకోనట్ జీన్ బ్యాంక్, కొవ్వూరులో అరటి జీన్ బ్యాంక్ ఏర్పాటు చేశారు. అనంతరాజుపేటలో టిష్యూ కల్చర్ అరటి ప్రయోగశాల, లాం గుంటూరులో నాణ్యతా ప్రమాణాల నియంత్రణ ప్రయోగశాల ఏర్పాటుచేశారు. విశ్వవిద్యాలయ పరిధిలోని నర్సరీలు ఏటా ఐదు లక్షలకు పైగా మొక్కలు సరఫరా చేస్తున్నాయి.

విదేశీ విద్యార్థులకు అవకాశం

మన విద్యార్థులే కాకుండా ఈ యూనివర్సిటీలో భూటాన్, బోట్స్వానా, దక్షిణ సూడాన్, నేపాల్, ఆఫ్ఘనిస్తాన్ వంటి దేశాలకు చెందిన విద్యార్థులు చదువుకుంటున్నారు. దేశంలో తెలంగాణ, బిహార్, ఒడిషా, మధ్యప్రదేశ్, కేరళ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు ఉద్యాన విద్యను అభ్యసిస్తున్నారు. శ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థులు గత ఐదేళ్లలో అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, జర్మనీ, కెనడా, ఇటలీ, పోలాండ్, నెదర్లాండ్స్, స్కాట్లాండ్ తదితర దేశాలలో వివిధ కోర్సులు అభ్యసించడానికి అర్హత సాధించారు.

గ్రామాల దత్తత

ఉద్యాన వర్సిటీ ద్వారా 171 గ్రామాల్ని దత్తత తీసుకొని పంటలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. 19 పంటలకు చెందిన 38 రకాల కొత్త వంగడాలను రాష్ట్ర, జాతీయ స్థాయిలో విడుదల చేశారు.

క్లస్టర్‌గా కొత్త ప్రయోగాలు

నిట్ ఏపీ, ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం, జేఎన్‌టీయు కాకినాడలలో ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యాశాఖ ద్వారా క్లస్టర్‌గా ఏర్పడి నూతన విద్యావిధానంలో వినూత్న ప్రయోగాలు చేసుకోడానికి ఉద్యాన వర్సిటీ వేదికగా మారింది.

కొత్త కేవీకేల ఏర్పాటు

గత ఐదేళ్ల కాలంలో రాష్ట్రంలోని కడప జిల్లా ఒనిపెంట, తిరుపతి జిల్లా పెరియవరంలో కొత్తగా కృషి విజ్ఞానకేంద్రాలను ఏర్పాటు చేశారు. శ్రీకాకుళం జిల్లా పెద్దపేటలో కొబ్బరి, జీడిమామిడి పరిశోధనా స్థానాలు ఏర్పాటుచేశారు. కడప జిల్లా పులివెందులలో వర్సిటీ ఆధ్వర్యంలో ఐదో ఉద్యాన కళాశాల ఏర్పాటు చేశారు. పులివెందులలో టిష్యూ కల్చర్ అరటి పరిశోధనా స్థానం ఏర్పాటు చేశారు. కడప జిల్లాలోని రాజంపేట, రైల్వే కోడూరు ప్రాంతాలలో పండే అరటిని అరబ్ దేశాలకు ఎగుమతి చేస్తుంటారు. ఎండు పూలతో విలువ ఆధారిత ఉత్పత్తులను తయారుచేసే ప్రక్రియలో బంగ్లాదేశీయులకు శిక్షణనిచ్చారు.

సీతంపేటలో వైద్య శిబిరం



వైద్య శిబిరంలో మందులు ఇస్తున్న దృశ్యం

సాక్షి స్పందన

దెందులూరు: సీతంపేట గ్రామంలో విద్యార్థికి డెంగూ నిర్ధారణ నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. దళితవీధిలో ఇంటింటా జ్వరాలపై సర్వే నిర్వహించారు. ఇళ్లల్లో, వీధుల్లో ఫాగింగ్ చేశారు. మలేరియా ఉపవైద్యాధికారి గోవిందరావు, పోతునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ అన్ని విభాగాల వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు గ్రామంలో ప్లెక్సీలు చేతపట్టి అవగాహన ర్యాలీ నిర్వహించారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, విరేచనాలు, కామెర్లు, ఇతర వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ర్యాలీలో ఆరోగ్య విస్తరణాధికారి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడి సాయం ఎప్పుడు?

పాందువ్వలో అధికారులకు రైతుల వినతిపత్రం



పాందువ్వలో పంచాయతీ కార్యదర్శి శివకు వినతిపత్రం అందిస్తున్న రైతులు

ఉండి: 'అయ్యా పెట్టుబడి సాయం ఇస్తామని చెప్పి చాలా రోజులైంది. ఇంతవరకు రైతులు, కౌలు రైతులకు పెట్టుబడి సాయంగా రూ.20 వేలు ఇవ్వలేదు. దయచేసి ఇప్పించగలరు' అంటూ ఉండి మండలం పాందువ్వకు చెందిన రైతులు, కౌలు రైతులు గ్రామ పంచాయతీ కార్యదర్శి శివకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023–24కు పంట నష్టం, పంటల బీమా, వ్యవసాయ కార్మికులకు ఉపాధి పని బకాయిలు, ధాన్యం డబ్బులు రైతులకు వెంటనే ఇప్పించాలని ముఖ్యమంత్రిని కోరుతున్నటుల్ తెలిపారు. పెట్టుబడి సాయం రూ.20 వేలు వెంటనే అందించి రైతన్నను ఆదుకోవాలని కోరారు. జిల్లాలో ఎక్కువ శాతం కౌలు రైతులే ఉన్నారని, వ్యవసాయానికి అవసరమైన డబ్బును అప్పుగా తెస్తున్నారని, వారిని ఆదుకోవాలని కోరారు. ఇటీవల భారీ వర్షాలకు వరి పూర్తిస్థాయిలో ముంపునకు గురైందని, రైతును ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రంగంలోకి దిగి నష్టపరిహారాన్ని, పెట్టుబడి సాయాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో మదాసి గోపీ, సీహెచ్ చిట్టిబాబు, దవిలి అప్పన్న, హెచ్.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంత రైతులను ఆదుకుంటాం



పెనుమంట్ర మండలం ఎస్.ఇల్లిందలపర్రులో మాట్లాడుతున్న మంత్రి కె.అచ్చెన్నాయుడు

పెనుమంట్ర: పెనుమంట్ర మండలంలో ముంపునకు గురైన ప్రాంతాలను శనివారం వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, హోం మంత్రి వంగలపూడి అనిత, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఇల్లిందలపర్రులో అచ్చెన్నాయుడు మాట్లాడుతూ వరదల కారణంగా నష్టపోయిన రైతులను అన్నివిధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. రైతులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. గోస్తనీ ప్రక్షాళనకు చర్యలు తీసుకుంటామని రైతులకు చెప్పారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



మంత్రి నిమ్మల రామానాయుడికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్

తణుకు: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలు కారణంగా తణుకు, తాడేపల్లిపల్లిగూడెం నియోజకవర్గాల్లో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ కోరారు. ఈ మేరకు శనివారం తణుకు వచ్చిన మంత్రులు అచ్చెన్నాయుడు, రామానాయుడుకు ఆయన వినతి పత్రాలు అందజేశారు. ఎలాంటి షరతులు లేకుండా నష్టపోయిన అన్ని పంటలను లెక్కించి నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ఎర్రకాలువ గట్ల పటిష్టత కోసం ఎత్తు పెంచాలని, ఎర్రకాలువ, సత్యవాడ డ్రైనేజీల్లో సిల్టు తొలగించాలన్నారు. తణుకు నియోజకవర్గంలో అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లకు మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

రైతును గాలికొదిలేశారు

- ఎర్రకాలువ ముంపు రైతులను ఆదుకునే ప్రకటన లేదు
- మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురంలో రైతులతో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: వరద, వర్షాలతో కుదేలైన రైతులను ఆదుకునేలా కూటమి ప్రభుత్వం ఒక్క ప్రకటన చేయలేదని మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ విమర్శించారు. శనివారం తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురం, అప్పారావుపేట ఎర్ర కాలువ ముంపు ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో సైతం రైతును ఆదుకునేలా ప్రకటన చేయలేదని దుయ్యబట్టారు. స్థానిక ప్రజాప్రతినిధి సైతం రైతులను గాలికొదిలేశారన్నారు. గతంలో ఎర్ర కాలువ ముంపు రైతులను ఆదుకునే ప్రయత్నం చేశామన్నారు. ఉచితంగా విత్తనాలు, నారుమడి అందించే ఏర్పాట్లు చేశామన్నారు. నష్టానికి ఇన్‌పుట్ సబ్సిడీ ఎప్పటిలోగా ఇస్తారో చెప్పాలన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలు ఎగ్గొట్టే ప్రయత్నం

నేటికీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందలేదని, మే నెలలో చెల్లించాల్సిన పెట్టుబడి సాయం చెల్లించలేదని, అమ్మ ఒడి లేదని, సూపర్ సిక్స్ హామీలు ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. బిహార్, ఆంధ్రప్రదేశ్‌పైనే కేంద్రం ఆధారపడి ఉండగా.. బిహార్ రూ.25 వేల నుంచి రూ.30 వేల కోట్ల గ్రాంట్ పొందిందన్నారు. రాష్ట్రం ఏమైనా పర్వాలేదు, రియల్ ఎస్టేట్ వ్యాపారం, భూములు మంచి ధరకు అమ్మేసి లక్షల కోట్లు ఆర్జించాలని చూస్తున్నారని ఆరోపించారు. పోలవరం ప్రాజెక్టు ప్రస్తావన బడ్జెట్‌లో లేదన్నారు. ముంపునకు గురవుతున్న వారికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కోసం ప్రభుత్వంపై ఏ ఒత్తిడి తీసుకొచ్చారని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, వైస్ ఎంపీపీ కట్టా రంగబాబు, ఎంపీటీసీ మార్లపూడి సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జడ్డు హరిబాబు, కొమ్ముగూడెం సొసైటీ చైర్మన్ వెలిశెట్టి నరేంద్రకుమార్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కర్రి భాస్కరరావు, నాయకులు బండారు నాగు, చిట్టూరి బాపన్న, బొద్దాని శ్రీనివాస్, ముప్పిడి లక్ష్మణరావు, బాసంశెట్టి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

వేలేరుపాడు: భద్రాచలం వద్ద మూడో ప్రమాద హెచ్చరిక దృష్ట్యా వరద ప్రభావిత ప్రాంతాలలో పారిశుధ్య నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులతో జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ సమీక్ష నిర్వహించారు. ఈ ఆయన మాట్లాడుతూ వేలేరుపాడు, కుక్కునూరు మండలాల ప్రజలకు పంచాయతీ కార్యదర్శుల సహకారం చాలా అవసరం అన్నారు. రెవెన్యూ, పౌర సరఫరా, వైద్య, గ్రామీణ తాగునీరు తదితర శాఖలను సమన్వయం చేసుకుని బాధితులకు ఉచితంగా ఇస్తున్న సివిల్ సరఫరా సరకులు, కూరగాయలు అందించేందుకు సహకారం అందించాలన్నారు. పునరావాస కేంద్రాలలో ఉన్న బాలింతలు, పిల్లలు, వృద్ధులు, దివ్యాంగులకు సరైన సౌకర్యాలు అందేలా చూడాలన్నారు. పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇస్తూ డయేరియా, మలేరియా, డెంగ్యూ తదితర వ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. ప్రమాద హెచ్చరిక జారీచేసినందున సిబ్బంది గ్రామాలు విడిచి వెళ్ళరాదని ఆదేశించారు. విధులలో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని డీపీఓ హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ రజాఉల్లాహ్, ఎంపీడీఓ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

గోదావరి ఉగ్రరూపం

వేలేరుపాడు/కుక్కునూరు: వేలేరుపాడు మండలంలో వరద ఉగ్రరూపం దాల్చింది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం శనివారం రాత్రి 53.80 అడుగులకు చేరడంతో మండలంలోని పలు గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. ఈ నెల 21 నుంచి చాలా గ్రామాలు వరద ముంపులో చిక్కుకోగా.. తాజాగా మరికొన్ని గ్రామాలు నీట మునిగాయి. ప్రజలు తిండి, తాగునీటి కోసం అల్లాడిపోతున్నారు. మండలంలో ఇంతవరకూ 35 గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. శనివారం రాత్రి వేలేరుపాడు సంతబజారు, చాకలిబజారు, ఎడవల్లి, బుర్రెడ్డిగూడెం, కాకిస్నూరు, టేకూరు, రుద్రమకోట కాలనీ తదితర గ్రామాల్లో ఇళ్లు నీటమునిగాయి. రోడ్లన్నీ నీట మునగడంతో మండల కేంద్రంతో దిగువనున్న 35 గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాయి. వేలేరుపాడు నుంచి కొయిదా వెళ్ళే రహదారిలో మేళ్ళవాగు, ఎద్దెలవాగు, టేకూరు వాగులు నీట మునగడంతో ఆయా గ్రామాలకు మండల కేంద్రంతో సంబంధాలు తెగిపోయి వారం రోజులవుతోంది. ఎద్దెలవాగు వద్ద అధికారులు ఒక బోటు ఏర్పాటు చేశారు. మండలంలోని రుద్రమకోట, రేపాకగొమ్ము, తిర్లాపురం గ్రామాలు కూడా జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. రుద్రమకోట గ్రామానికి చెందిన 40 కుటుంబాలు గుట్ట పై తాత్కాలికంగా గుడారాలు వేసుకున్నారు. భూదేవిపేట నుంచి చాగరపల్లి వెళ్లే రహదారిలో బుర్రతోగు మేళ్ళవాగు వంతెన శనివారం రాత్రి నీటమునిగింది. వేలేరుపాడు మండలంలోని తాట్కూరుగొమ్ము, రేపాకగొమ్ము, తిర్లాపురం, పాత నార్లవరం, వేలేరుపాడు సంతబజారు, రుద్రమకోట గ్రామాల్లో అనేక కుటుంబాలు పునరావాస కేంద్రాలకు తరలివెళ్ళాయి. ఇందులో కొంత మంది వరద బాధితులను శివకాశీపురం గిరిజన ఆశ్రమ పాఠశాల, భూదేవిపేట కస్తూర్బా గాంధీ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించారు. రేపాకగొమ్ము గ్రామస్తులను కుక్కునూరు మండలం రాయికుంటలో ఉన్న పోలవరం నిర్వాసితుల కాలనీకి తరలించారు.



వేలేరుపాడు మండలం రుద్రమకోట వరద బాధితులను బోటుపై తరలిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

భీమవరంలో రాష్ట్ర స్థాయి చెస్ పోటీల ప్రారంభం



భీమవరంలో చెస్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

భీమవరం : జిల్లా చెస్ అసోసియేషన్, అనసూయ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో అండర్-11 రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు పట్టణంలోని ప్యాడీ అండ్ రైస్ మర్చంట్ అసోసియేషన్ భవనంలో శనివారం ప్రారంభమయ్యాయి. పోటీలను ప్యాడీ అండ్ రైస్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు చవాకుల నర్సింహారావు ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చెస్ ద్వారా మేధస్సు పెంపొందుతుందని, తద్వారా ఉన్నత విద్యలోనూ రాణిస్తారన్నారు. రాష్ట్ర చెస్ అసోసియేషన్ కోశాధికారి జ్వాలాముఖి మాట్లాడుతూ భీమవరంలో నిర్వహిస్తున్న పోటీల్లో గెలుపొందిన విజేతలు తెలంగాణలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవుతారన్నారు. జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్ మాట్లాడుతూ 20 జిల్లాల నుంచి 150 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి ఉదయ్‌కుమార్, విజ్ఞాన వేదిక సేవా సంస్థ అధ్యక్షుడు అల్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యాప్ ద్వారా లోన్ ఇప్పించి రూ.6 లక్షల కాజేత

భీమవరం: కొరియర్ వచ్చిందంటూ ఫోన్‌లో మాటలు కలిపి మొబైల్ యాప్ ద్వారా రుణం కూడా ఇప్పించి వాటిలో రూ.6 లక్షలను అపరిచిత వ్యక్తులు కాజేశారు. భీమవరం టుటౌన్ సీఐ జి శ్రీనివాస్ శనివారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భీమవరానికి చెందిన గంగవరపు గణేష్‌కు ఈనెల 24న అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి మీ పేరున కొరియర్ పార్శిల్ వచ్చిందని, అందులో బట్టలు, పాస్‌పోర్టు ఉన్నాయని, వాటిని తీసుకోవాలంటే బ్యాంక్ ఖాతాకు సొమ్ములు వేయాలని సూచించారు. దీంతో తన బ్యాంక్ అకౌంట్‌లో సొమ్ములు లేవంటూ గణేష్ చెప్పడంతో మొబైల్ యాప్ ద్వారా రూ.16,11,741 రుణం ఇప్పించడమే కాక అందులో రూ.6 లక్షలను తమ ఖాతాలో వేయించుకున్నారు. మిగిలిన సొమ్ము కూడా తమ ఖాతాలో వేయాలంటూ గణేష్‌పై ఒత్తిడి తెచ్చారు. బాధితుడు ఫిర్యాదు మేరకు సీఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'లంక'కు మళ్లీ వరద పోటు



దొడ్డిపట్ల ఏటిగట్టు దిగువున ఇళ్ల చుట్టూ చేరిన వరద నీరు

యలమంచిలి: లంక గ్రామాల్లో గోదావరిలో వరద తగ్గినట్టే తగ్గి మళ్లీ పెరుగుతోంది. కనకాయలంక, పెదలంక, లక్ష్మీపాలెం, బాడవ గ్రామాలలో శుక్రవారం రోడ్ల మీదకు నీరు రాగా, శనివారం మధ్యాహ్నం వరద తగ్గుముఖం పట్టింది. అయితే సాయంత్రం ఆరు గంటల తరువాత వరద క్రమేపీ మళ్లీ పెరగడం మొదలైంది. భద్రాచలం వద్ద శనివారం సాయంత్రానికి 50 అడుగులకు నీటిమట్టం చేరుకోవడంతో గోదావరి దిగువున ఉన్న ఆచంట, యలమంచిలి మండలంలోని లంక గ్రామాలన్నీ ఆదివారం పూర్తిగా జలదిగ్బంధం అయ్యే అవకాశం ఉంది. భద్రాచలం వద్ద మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తే మండలంలోని దొడ్డిపట్ల మత్స్యకార కాలనీ, లక్ష్మీపాలెం, యలమంచిలిలంక, బాడవ, కనకాయలంక, పెదలంక గ్రామాలు పూర్తిగా, అబ్బిరాజుపాలెం, గంగడుపాలెం, ఏనుగువానిలంక గ్రామాలు పాక్షికంగా వరద ముంపునకు గురవుతాయి. ఐదు రోజులుగా లంక గ్రామాలలో వరద నీరు ఉండడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. పనులు లేక కూలీలు అలమటిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నిత్యావసర సరుకులు అందించి ఆదుకోవాలని వరద బాధితులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా పెదలంక, కనకాయలంక గ్రామాలలో వరద సహాయ విధుల్లో నిమగ్నమైన అధికారులకు ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. బురదనీటి ప్రవాహంపై నుంచి వచ్చే ఈదురు గాలుల వలన విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది శరీరంపై దద్దుర్లతో బాధపడుతున్నారు.



లక్ష్మీపాలెంలో జలమయమైన రోడ్డు



కనకాయలంక వద్ద కాజ్‌వే పైనుంచి పరవళ్లు తొక్కుతున్న గోదావరి



బాడవలో ఇటుక బట్టీలను చుట్టుముట్టిన నీరు

ఎస్సీ వర్గీకరణ హామీ అమలు చేయాలి

ఎమ్మార్పీఎస్ఎస్ రాష్ట్ర ముఖ్యనాయకుల సమావేశంలో సంజయ్ మాదిగ



తణుకులో మాట్లాడుతున్న రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బుంగా సంజయ్ మాదిగ

తణుకు: మాదిగలను మరోసారి మోసం చేసే విధంగా రాజకీయ పార్టీలు కపట ప్రేమ చూపిస్తే ఏ ప్రభుత్వాన్నైనా గద్దె దించే సత్తా మాదిగలకు ఉందని మాదిగ రిజర్వేషన్ పోరాట సాధన సమితి (ఎమ్మార్పీఎస్ఎస్) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బుంగా సంజయ్ మాదిగ హెచ్చరించారు. శనివారం తణుకు పాతవూరులో ఎమ్మార్పీఎస్ఎస్ రాష్ట్ర ముఖ్య నాయకుల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు సిర్రా బ్రహ్మయ్యమాదిగ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంజయ్‌మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అంశంతోపాటు మాదిగలకు సంక్షేమ పథకాలు, రాజకీయాల్లో అవకాశాలు కల్పించేలా పార్టీలు కృషి చేయాలన్నారు. ఎన్నికలకు ముందు ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని చెప్పిన ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు నాయుడు తాము ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చుకోవాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు మల్లిపూడి జగ్జీవన్‌మాదిగ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బజ్జంగి సుధాకర్ మాదిగ, రాష్ట్ర మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ అధ్యక్షులు సొంగా ప్రసాద్, కడప జిల్లా అధ్యక్షులు ఎదురిం బాబు, రాష్ట్ర మాదిగ స్టూడెంట్స్ ఫెడరేషన్ అధ్యక్షులు సునీల్‌దత్, వేశంగి శ్యాంబాబు, సిర్రా రాజు, సిర్రా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సృజనతో ప్రతిభ చూపాలి



ఐడియా ఫెస్ట్‌లో పాల్గొన్న అతిథులు

తాడేపల్లిగూడెం: సృజనతో ప్రతిభ చూపితే మెరుగైన అవకాశాలను అందుకోవచ్చని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. వెంకట్రామన్నగూడెంలోని ఉద్యాన కళాశాలలోని కెరీర్ డెవలప్‌మెంటు సెంటర్‌లో శనివారం ఇన్నోవేషన్ క్రియేటివ్ కంపోనెంట్ కింద ఐడియా ఫెస్ట్ నిర్వహించారు. వివిధ కళాశాలల నుంచి వచ్చిన 37 మంది విద్యార్థులు ఇన్నోవేటివ్ ఐడియాస్‌ను ప్రదర్శించారు. న్యాయ నిర్ణేతలుగా సీనియర్ బిజినెస్ డెవలప్‌మెంటు మేనేజర్ ఏఎస్.సత్యేంద్రకుమార్, ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ పూజ, సుబిన్ థామస్ వ్యవహరించారు. కార్యక్రమానికి డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డి.ఆర్.సలోమి సునీత, అసోసియేట్ డీన్ ఎం.మాధవి తదితరులు పాల్గొన్నారు.



కిటకిటలాడిన చినవెంకన్న క్షేత్రం

ద్వారకాతిరుమల: చినవెంకన్న క్షేత్రం శనివారం భక్తులతో కిటకిటలాడింది. శ్రీవారికి ప్రీతికరమైనరోజు కావడంతో సుదూర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే భక్తుల రాక ప్రారంభం కావడంతో క్షేత్ర పరిసరాలు సందడిగా మారాయి. ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతం, అనివెట్టి మండపం, వైకుంఠం క్యూకాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల, నిత్యాన్నదాన విభాగాలు భక్తులతో కిక్కిరిశాయి. ఆలయ అనివేటి మండపంలో పలు భజన మండలి సభ్యులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు చూపరులను అలరించాయి. సాయంత్రం వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది.

నూజివీడుపైనే మోజు

- ఆర్జీయూకేటీ పరిధిలో రాష్ట్రంలో నాలుగు ట్రిపుల్ ఐటీలు
- ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం కంటే నూజివీడుపైనే ఆసక్తి
- కళాశాలల్లో చేరికల కోసం తాజాగా ముగిసిన కౌన్సెలింగ్ ప్రక్రియ
- మెరిట్ టాప్‌లో తొలి 20 మందిలో 16 మంది నూజివీడులో చేరిక
- వసతులు, ఉత్తమ ఫ్యాకల్టీ, మెరుగైన ప్యాకేజీలతో ఉద్యోగాలే కారణం



నూజివీడు: రాష్ట్రంలో రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో నూజివీడులో సీటు కోసం విద్యార్థులు ఎగబడుతున్నారు. ట్రిపుల్ ఐటీలను ఏర్పాటు చేసిన నాటి నుంచి మిగిలిన వాటి కంటే నూజివీడులో సీటు కోసమే అధికశాతం మంది ఆసక్తి కనబరుస్తారు. అంతేగాకుండా మిగిలిన క్యాంపస్‌లలో సీట్లు వచ్చిన వారు సైతం అక్కడ చేరిన తరువాత నూజివీడు క్యాంపస్‌కు మార్చుకునేవారు. ఒక్కొక్క ట్రిపుల్ ఐటీలో 1000 సీట్లతో పాటు ఈడబ్ల్యూఎస్ కింద అదనంగా మరో 100 సీట్లు కలిపి 1100 సీట్లు ఉన్నాయి. దీంతో నాలుగు ట్రిపుల్ ఐటీల్లో కలిపి 4,400 సీట్లు ఉన్నాయి. ఈ ఏడాది ట్రిపుల్ ఐటీలకు 53,813 దరఖాస్తులు రాగా ప్రత్యేక కేటగిరి సీట్లు మినహాయించి మిగిలిన సీట్లకు ఈనెల 22 నుంచి 27 వరకు కౌన్సెలింగ్‌ను నిర్వహించారు. దీనిలో పదో తరగతిలో అత్యధిక మార్కులు వచ్చిన తొలి 20 మందిలో 16 మంది నూజివీడు ట్రిపుల్ ఐటీలో చేరేందుకే మొగ్గు చూపడం విశేషం.

వసతులు, సదుపాయాలు మెండు

నూజివీడు ట్రిపుల్ ఐటీలో మిగిలిన వాటి కంటే మెరుగైన వసతులు, సదుపాయాలు ఉన్నాయి. తరగతి గదులకు సంబంధించి మూడు అకడమిక్ భవంతులు, ఇంజినీరింగ్ విద్యార్థులకు సంబంధించి అన్ని బ్రాంచిలకు సంబంధించిన ల్యాబ్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటన్నింటికి తోడు హాస్టల్ భవనాలు సైతం విద్యార్థినీ విద్యార్థులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటాయి. డైనింగ్ హాల్స్‌కు ప్రత్యేక భవన వసతి, క్యాంపస్‌లో 24 గంటలూ పనిచేసే 20 పడకల ఆసుపత్రి సైతం విద్యార్థులకు అందుబాటులో ఉంది. ఇవన్నీ ఒక ఎత్తయితే రాష్ట్రంలో అన్ని ప్రాంతాలకు మధ్యలో ఉండటం కూడా నూజివీడు ట్రిపుల్ ఐటీలో చేరేందుకు విద్యార్థులు మొగ్గు చూపుతున్నారు.

ప్లేస్‌మెంట్స్ కూడా అధికమే

నూజివీడు ట్రిపుల్ ఐటీలో ప్రారంభం నుంచి ప్లేస్‌మెంట్స్ అధికంగా ఉంటున్నాయి. ఇంజినీరింగ్ ఆఖరి సంవత్సరంలో నిరంతరం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తూ అత్యధిక మంది విద్యార్థులకు మంచి ప్యాకేజీలు లభించేలా ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ప్లేస్‌మెంట్‌ల కోసం నూజివీడు ట్రిపుల్ ఐటీలో ప్రత్యేకంగా ప్లేస్‌మెంట్ సెల్‌నే ఏర్పాటు చేశారు. ఈ సెల్ నిత్యం విద్యార్థులకు మాక్ ఇంటర్వ్యూలు నిర్వహించడం, టెస్ట్‌లు పెట్టడం, సాఫ్ట్‌వేర్ కంపెనీల ప్రతినిధులతో మాట్లాడి క్యాంపస్ ఇంటర్వ్యూలు ఏర్పాటు చేయడం వంటివి చేస్తూ ఉంటారు. అంతేగాకుండా విద్యార్థుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్‌స్కిల్స్ తదితర వాటిల్లో ప్రావీణ్యత సంపాదించేలా చూడటంతో పాటు కంపెనీలకు ఏమి అవసరమో ఆ విధంగా విద్యార్థులను తీర్చిదిద్దుతోంది. అంతేగాకుండా నూజివీడు ట్రిపుల్ ఐటీలో దాదాపు 25 మంది పర్మినెంట్ ఫ్యాకల్టీ ఉండటం, వీరంతా దేశంలోని ఐఐటీల్లో ఎంటెక్ పూర్తిచేసిన వారు కావడంతో ప్రపంచ వ్యాప్తంగా ఇంజినీరింగ్ విద్యలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచేవిధంగా బోధన చేస్తూ వారి అభివృద్ధికి కృషి చేస్తున్నారు.

ట్రిపుల్ ఐటీ	కౌన్సెలింగ్‌కు పిలిచిన విద్యార్థులు	చేరిన వారు
నూజివీడు	1035	883
ఇడుపులపాయ	1035	858
ఒంగోలు	1035	792
శ్రీకాకుళం	1035	863

ఆటో బోల్తా.. నలుగురికి గాయాలు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో సెంట్రింగ్ పనులు ముగించుకుని స్వగ్రామానికి తిరుగు ప్రయాణమైన కార్మికుల ఆటో అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో నలుగురు కార్మికులకు గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. తణుకుకు చెందిన సెంట్రింగ్ కార్మికుడు దుద్దే సుగుణరావు, మరో ఏడుగురు శ్రీవారి కొండపైన ఒక కట్టడానికి శనివారం ఉదయం నుంచి సెంట్రింగ్ అమర్చారు. పనుల అనంతరం వచ్చిన ఆటోలోనే వారంతా తిరుగు ప్రయాణమయ్యారు. అనంతరం కొద్దిసేపటికే రోడ్డు మధ్యలోని గుంతలో పడి ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టింది. స్థానికులు బోల్తా పడిన ఆటో నుంచి కార్మికులను బయటకు తీశారు. అనంతరం వారంతా అదే ఆటోలో తిరుగు ప్రయాణమయ్యారు.

పట్టపగలే విద్యుత్ మోటారు అపహరణ

ఏలూరు టౌన్: ఇంటి నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ మోటారును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. ఏలూరు రూరల్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఏలూరు రూరల్ పరిధిలో అండాళ్లమ్మ తోటలో ఒక ఇంటి నిర్మాణం నిమిత్తం ప్రాంగణంలో బిగించిన విద్యుత్ మోటారును ఈ నెల 26న పట్టపగలే అపహరించుకుపోయారు. ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు మోటారు దొంగలించిన దృశ్యాలు సమీపంలో ఉన్న సీసీ కెమెరాలో నమోదయ్యాయి. సీసీ టీవీ పుటేజ్‌ని ఇంటి యజమాని శ్రీనివాస్ పోలీసులకు అప్పగించారు. ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యాన పంటలను కాపాడండిలా..

పాడి-పంట



తాడేపల్లిగూడెం: భారీ వర్షాలు, వరదల కారణంగా ఉద్యాన పంటలకు కలిగిన నష్టాన్ని నివారించడానికి తీసుకోవాల్సిన చర్యలపై శాస్త్రవేత్తలు రైతులకు దిశా నిర్దేశం చేస్తున్నారు. పంటలను కాపాడుకోడానికి ఎలాంటి పద్ధతులు పాటించాలో వివరించారు.

అరటికి సిగటోక తెగులు

అధిక వర్షాల వల్ల అరటిలో సిగటోక తెగులు ఉధృతి ఎక్కువగా కనిపిస్తుంది. దీని నివారణకు ప్రొపికొనజోల్ ఒక మిల్లీ లీటరు, మినరల్ ఆయిల్ పది మిల్లీ లీటర్లు, ఒక లీటరు నీటిలో కలిపి మొదటగా పిచికారీ చేయాలి. కార్బెండజిమ్ , మాంకోజెబ్ ఒక గ్రాము, మినరల్ ఆయిల్ పది మిల్లీ లీటర్లు, ఒక లీటరు నీటిలో కలిపి రెండో పిచికారీగా చేయాలి. ట్రైఫోక్సిస్ట్రోబిన్, టెబు కొనజోల్ 1.4 గ్రాములు, పది మిల్లీలీటర్ల మినరల్ ఆయిల్ ఒక లీటరు నీటిలో కలిపి మూడో పిచికారీగా చేయాలి. ఒక మిల్లీ లీటరు ట్రైపెనొకొనజోల్, పది మిల్లీ లీటర్ల మినరల్ ఆయిల్ నీటి వంతున 25 రోజుల వ్యవధిలో నాలుగో పిచికారీ చేయాలి. తెగులు ఉధృతి తగ్గిన తర్వాత మందులను మరోసారి పిచికారీ చేయాలి.

బొప్పాయిలో కాండం కుళ్లు

వానల వల్ల బొప్పాయిలో కాండం కుళ్లు తెగులు రావడానికి అవకాశం ఎక్కువగా ఉంది. వేర్లు మొదలు మొత్తం కుళ్లే ప్రమాదం ఉంది. కాయలు ఉన్న చెట్లకు ఆశించినట్లయ్యితే నష్టం అధికంగా ఉంటుంది. దీని నివారణకు మొక్క మొదలు దగ్గర నీరు నిలువ లేకుండా చూసుకోవాలి. బోర్డో మిశ్రమం ఒక శాతం, లేదా అలిమేట్ రెండు గ్రాములు లీటరు నీటిలో కలిపి మొదళ్ల తడపాలి. వారం రోజుల వ్యవధిలో రెండు నుంచి మూడు సార్లు తడపాలి. పది గ్రాముల ట్రైకోడెర్మావిరిడి ఒక లీటరు నీటికి కలిపి బొప్పాయి మొక్కల మొదలు చుట్టూ బాగా తడిసేటట్లు పోయాలి. తెల్లదోమ, పేనుబంక లాంటి కీటకాలు ఎక్కువవుతాయి. వైరస్ తెగులు కనిపిస్తుంది. పది గ్రాముల యూరియా, 1.5 గ్రాముల జింక్ సల్ఫేట్‌తో పాటు బోరాన్ ఒక గ్రాము, ఒక లీటరు నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

కంద, చేమలలో ఆకుమచ్చ తెగులు

ఉభయ గోదావరి జిల్లాల్లో కురిసిన వానల కారణంగా కంద, చేమ పంటల్లో ఆకుమచ్చ తెగులు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. దీని నివారణకు మెటాలాక్సిల్ ఎం.జెడ్ రెండుగ్రాములు, లీటరు నీటిలో కలిపి ఆకులన్నీ తడిచేటట్లుగా పిచికారీ చేయాలి. గోదావరి పరీవాహక లంక ప్రాంతాల్లో సాగు చేసే కంద పొలాల్లో నీరు తీసిన తర్వాత ఎకరాకు 70 కిలోల యూరియా, 50 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాషియం, వేసి పైపాటుగా 13-0-45 ఐదు గ్రాముల లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. నీరు ఎక్కువగా నిల్వ ఉంటే ఐదు నుంచి ఆరు నెలల వయసున్న పంటను తవ్వి మార్కెట్‌కు పంపించాలి.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

- వృద్ధురాలు అక్కడికక్కడే మృతి.. డ్రైవర్‌కు తీవ్ర గాయాలు
- మరో 15 మంది ప్రయాణికులకు స్వల్పగాయాలు
- మన్యం జిల్లా నుంచి విజయవాడలో కనకదుర్గ దర్శనానికి వెళుతుండగా కలపర్రు వద్ద హైవేపై ఘటన




ప్రమాదంలో ట్రావెల్స్ బస్సు ముందు భాగం దెబ్బతిన్న దృశ్యం

పెదపాడు: కలపర్రు వద్ద జాతీయ రహదారిపై ఆగి ఉన్న ఓ లారీని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందింది. కాగా ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కాగా, బస్సులో ఉన్న 15 మంది ప్రయాణికులకు స్వల్పగాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మన్యం జిల్లా నుంచి విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారి దర్శనం కోసం ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో సుమారు 16 మంది బయలుదేరారు. శనివారం తెల్లవారుజామున కలపర్రు వద్దకు వచ్చేసరికి రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం పెద్దూరు గ్రామానికి చెందిన ముగడ కృష్ణవేణి (64) తీవ్ర గాయాలపాలై సీటులోనే మృతి చెందింది. డ్రైవర్ కిలారు లక్ష్మణరావుకు తీవ్ర గాయాలు కాగా, అతనిని చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా మరో 15 మంది ప్రయాణికులకు గాయాలు కాగా, వారికి ప్రాథమిక చికిత్స అందించారు. ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాలతో ఏలూరు ఆర్డీఓ ఎస్‌కే ఖాజావలి ఘటనా స్థలానికి చేరుకుని ప్రయాణికులను వేరే బస్సులో గమ్యస్థానాలకు తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి పెదపాడు ఎస్సై శుభశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో అనర్థాలు

- పెరిగిపోతున్న వినియోగం
- పేరుకుపోతున్న చెత్త
- ఆందోళన వ్యక్తం చేస్తున్న పర్యావరణ వేత్తలు


డ్రైనేజీలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు


శివాలయం సమీపంలో ఒక వీధిలో ప్లాస్టిక్ వ్యర్థాలు

పెంటపాడు: బయటకు వెళితే కాళ్లు కడుక్కొని ఇంటిలోకి వచ్చే మనం కాలుష్యాన్ని మాత్రం స్వయంగా కొనుక్కొని మరీ ఇంట్లోకి తెచ్చేసుకుంటున్నాం. చిన్నపాటి అశ్రద్ధ కారణంగా ప్రతీ రోజు పదుల సంఖ్యలో క్యారీ బ్యాగులను వాడుతూ అటు పర్యావరణానికి, ఇటు అంతిమంగా మానవ ఆరోగ్యానికి ముప్పు తెచ్చుకొంటున్నాం. గుడ్డతో తయారు చేసిన చేతి సంచిని వినియోగిస్తే ఒక కుటుంబం రోజుకు పదికి పైగా ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వాడకాన్ని తగ్గించొచ్చు. కానీ ఆ దిశగా ఎవరూ ఆలోచించడం లేదు. దీంతో విచ్చలవిడిగా ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి, ఇవన్నీ గ్రామాల శివార్లలోని డంపింగ్ యార్డులకు చేరుతున్నాయి. కొండల్లా పేరుకుపోతున్న వీటిని వదిలించే క్రమంలో నిప్పు పెడుతున్నారు. దీంతో తీవ్రమైన వాతావరణ కాలుష్యం ఏర్పడుతుంది. ఇంకా వాతావరణం వేడెక్కి కాలుష్యం మరింత పెరిగి చివరికి మన ఆరోగ్యానికి మనమే ముప్పు తెచ్చుకొంటున్నాం. ప్లాస్టిక్ నిషేధంపై ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు తీసుకొంటున్నప్పటికీ అమలు చేయాల్సిన యంత్రాంగం మాత్రం నిర్లక్ష్యం చూపుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్లాస్టిక్ నిషేధం పల్లెల్లో పూర్తి స్థాయిలో చేరకపోవడంతో పెద్ద ఎత్తున వినియోగం పెరిగిపోతోంది. ప్రధానంగా మండలంలో ముదునూరు చిలకంపాడు లాకులు, కె.పెంటపాడు బుడగ జంగాల పేట, పెంటపాడు కునాకరపేట, యానాలపల్లి గ్రామ శివారు, పలు ప్రాంతాలలో రోడ్లకు ఇరువైపులా చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. బాగా పెరిగాక వాటిని అంటిస్తున్నారు. రోజు, విడిచి రోజు అయినా గ్రామాల పారిశుద్ధ్య సిబ్బంది పట్టించుకోవడం లేదని ప్రజలు చెబుతున్నారు. కూరగాయలు, టిఫిన్లు ఇతర ఆహార పదార్థాలు ఇళ్లకు తెచ్చుకోవడానికి, పాల ప్యాకెట్లు, డిస్పోజబుల్ ప్లేట్లు ఇలా ఉదయం నుంచి రాత్రి వరకు ప్రతీ అవసరంలోనూ ప్లాస్టిక్ వస్తువులనే వినియోగిస్తున్నారు.

రోజూ 50 టన్నుల చెత్త

నియోజకవర్గంలో పెంటపాడు, గూడెం మండలాల్లోని గ్రామాల నుంచి నిత్యం సుమారు 50 టన్నుల వరకు చెత్త పోగవుతుందని ఒక అంచనా. ఇందులో సుమారు 3 టన్నుల వరకు ప్లాస్టిక్ వ్యర్థాలు ఉంటున్నాయి. తడి, పొడి చెత్త విషయంలో అలసత్వం వహిస్తున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను తిరిగి ఉపయోగించుకోవాలన్న ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు.

చెత్తకు నిప్పు పెడితే ప్రమాదమే

ప్లాస్టిక్ కాలిస్తే మరింత ప్రమాదమని హెచ్చరిస్తున్నప్పటికీ చెత్తతో పాటే ప్లాస్టిక్‌ను కూడా తగలబెడుతున్నారు. ఈ ప్రక్రియతో విపరీతమైన వాయు కాలుష్యం ఏర్పడుతోంది. శ్వాస సంబంధ వ్యాధులతో ఇబ్బందులు పడే వారి సంఖ్య పెరగడానికి ప్రధాన కారణాల్లో ముఖ్యమైంది ప్లాస్టిక్‌ను మండించమేనని వైద్యులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంపై ఎవరికి వారు అవగాహన పెంచుకోవాలని పర్యావరణ వేత్తలు సూచిస్తున్నారు. ప్లాస్టిక్ తగలబెట్టకుండా ప్రభుత్వ యంత్రాంగం చర్యలు చేపట్టాలని ఇందుకు ప్రజా ప్రతినిధులు, నాయకులు చొరవ చూపాలని పర్యావరణ వేత్తలు కోరుతున్నారు.

క్లుప్తంగా

డ్రగ్స్ వినియోగంతో జీవితం దుర్భరం


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవి

తాడేపల్లిగూడెం (టీఓసీ): డ్రగ్స్ వినియోగం వలన జీవితాలు దుర్భరమవుతాయని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవి విద్యార్థులకు సూచించారు. శశి విద్యార్థులకు శనివారం ర్యాగింగ్, డ్రగ్స్ వల్ల వచ్చే సమస్యలపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మాధవి మాట్లాడుతూ ర్యాగింగ్ వలన విద్యార్థులు జీవితాన్ని, కుటుంబాన్ని కోల్పోతారన్నారు. రాజ్యాంగం, చట్టాలపై అవగాహన కల్పించారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ షేక్ ఇస్మాయిల్, డీన్ సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

తణుకు టౌన్: మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి ఏవీ నాగరాజు అన్నారు. చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ గొల్ల ప్రభాకరరావు, ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఎం.అరుణకుమారి, కౌరు వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

38.4 మిల్లీ మీటర్ల వర్షపాతం

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణం, మండలంలో గడచిన 24 గంటల్లో 38.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ మురళీకృష్ణ శనివారం తెలిపారు. పెంటపాడు మండలంలో 25.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందన్నారు.

పంచాయతీ చెరువుల వేలం


సచివాలయంలో వేలం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కొండ్రుప్రోలు పంచాయతీ చెరువులకు శనివారం మూడేళ్ల కాల పరిమితికి వేలం నిర్వహించారు. గౌరమ్మ చెరువుకు రూ.13.50 లక్షలు, పేరయ్య చెరువులకు రూ.9.20 లక్షలు, అంబాదేవి చెరువుకు రూ.15.25 లక్షలు, తుంబలకుంట చెరువుకు రూ.76 వేలు, పిల్లల కర్ర చెరువులకు రూ.3 వేలు లభించినట్లు ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్ తెలిపారు. పంచాయతీ కార్యదర్శి వై.హరికిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణ అధికారి పర్యటన


ప్రత్తిపాడులో మిడ్ లెవెల్ పరీవాహక ప్రాంతంలో పర్యటిస్తున్న అధికారులు

పెంటపాడు: తాగునీరు కలుషితంపై ఏలూరు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎనలిస్ట్ తేజశ్విని శనివారం పలు గ్రామాలు పర్యటించారు. పెంటపాడు మండలంలోని ప్రత్తిపాడులో ఫ్యాక్టరీల కలుషితాలు రాచర్ల పంట కాలువలో కలిసి తాగునీరు కలుషితం అవుతోందని రాచర్ల, వల్లూరుపల్లి దర్శిపర్రు గ్రామాల ప్రజలు ఇచ్చిన ఫిర్యాదుపై ఆమె పలు ప్రాంతాలలో శాంపిల్స్ సేకరించారు. ఈ నీటి శ్యాంపిల్స్‌ను పరిశీలన కోసం విశాఖపట్నం పంపుతామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాలాజీ, ఈవోపీఆర్డీ ప్రసాద్, కార్యదర్శులు పాల్గొన్నారు.

నిబద్ధతతో విద్యాభ్యాసం చేయాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): నిబద్ధతతో విద్యాభ్యాసం చేస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించొచ్చని పలువురు వక్తలు పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక వాసవీ జీఎంఆర్ జూనియర్అండ్‌డిగ్రీ కళాశాలలో పర్సనాలటీ డెవలప్‌మెంట్‌పై సెమినార్ నిర్వహించారు. టైం మేనేజ్‌మెంట్, అక్షరాస్యత, కమ్యూనికేషన్ స్కిల్స్, లీడర్ షిప్ క్వాలిటీస్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల కరస్పాండెంట్ లక్ష్మీనారాయణ, కోశాధికారి సూర్యనారాయణ మూర్తి, డైరక్టర్ పి.నరసింహరావు, వంగపండు రామ్మోహన్‌రావు, వీఎస్ఎన్ శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

సంగీత కచేరీ


సంగీత కచేరీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని సుబ్బారావుపేట శ్రీ సత్యసాయి మందిరంలో శనివారం సాయంత్రం జంధ్యాల దివ్య, ఆద్విక్ సాయి, అక్షయ్ సాయిలచే సంగీత కచేరీ నిర్వహించారు. మృదంగంపై జగన్మోహిణి, వయోలిన్‌పై సుబ్బారాయన్ సహకరించారు. జంధ్యాల నాగేశ్వరరావు, పద్మావతి, సత్యసాయి సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

కౌలు రైతులను ఆదుకోవాలి


వీఆర్వో రామకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘ నాయకులు

పెంటపాడు: రాష్ట్రంలో అధిక వర్షాల వలన దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని, ప్రధానంగా కౌలు రైతుల ఇబ్బందులను తీర్చాలని ఏపీ రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా శనివారం జట్లపాలెం గ్రామ సచివాలయం వద్ద నిరసన తెలిపారు. తమ సమస్యలతో కూడిన వినతి పత్రం వీఆర్వో రామకృష్ణకు సమర్పించారు. ఈ సందర్భంగా రైతు సంఘ మండల అధ్యక్ష, కార్యదర్శులు చిర్ల పుల్లారెడ్డి, కరక వెంకట్రావు, సీఐటీయూ ఉపాధ్యక్షుడు శిరపరపు రంగారావు మాట్లాడుతూ ఇప్పటికే ఎకరాకు రూ.8 వేల నుంచి రూ.10 వేలు పైగా పెట్టుబడులు పెట్టారన్నారు. నష్టపోయిన రైతులకు ఎరువులు, విత్తనాలు ఉచితంగా అందించాలన్నారు. బొబ్బిలి కొండలరావు, గాలి అప్పాయమ్మ, సాధనాల శ్రీనివాసరావు, సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

పెంట్లమ్మకు ఆషాఢం సారె

పెంటపాడు: ఉమామహేశ్వరం గ్రామ దేవత పెంట్లమ్మ ఆషాఢం సారె కార్యక్రమం గ్రామంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి మహిళలు, ఆడపడుచులు సారె సమర్పించారు. కార్యక్రమంలో రాయుడు శ్రీనివాసరావు, భక్తులు పాల్గొన్నారు.

కలాం ఆశయాలే విద్యార్థులకు స్ఫూర్తి


అబ్దుల్ కలాం విగ్రహం వద్ద నినదిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: కలలు కనండి వాటిని సాకారం చేసుకోండి అనే పిలుపుతో సమాజాన్ని తట్టి లేపిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఆశయాలను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని డీవైఈవో డి.మురళి సత్యనారాయణ అన్నారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా స్థానిక జెడ్పీ బాయ్స్ హైస్కూల్లో ఆయన విగ్రహానికి శనివారం పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీవైఈవో మాట్లాడుతూ సైన్స్ మాంత్రికుడిగా క్షిపణి పరీక్షల్లో భారతదేశాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడని అన్నారు. హెచ్ఎం కె.పద్మావతి, ఉపాధ్యాయులు ఉమాదేవి, డేవిడ్‌రాజు, రాంబాబు, సులోచన, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా పూలే అంబేద్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో...

ఆల్ ఇండియా పూలే అంబేద్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, న్యాయవాది పొట్ల సురేష్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వల్లూరు శ్రీరామ్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మెరిపే శ్రీను, ఎస్.పెద్దిరాజు, భరత్, వల్లూరి దత్తసాయి, పొట్ల రేమ్‌ష, నాగరాజు, సభ్యులు పాల్గొన్నారు.

మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు పరామర్శ


సర్వేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం కొట్టు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని అప్పారావుపేటకు చెందిన సోమలంక సర్వేశ్వరరావు ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా శనివారం ఆయన కుటుంబాన్ని మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ పరామర్శించారు. సర్వేశ్వరరావు మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. తాడేపల్లిగూడెం పట్టణ సవిత్రుపేటకు చెందిన రావూరి భాస్కరబాబా అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఆయన వెంట ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కర్రి భాస్కరరావు, నాయకులు బండారు నాగు, ఆకుల ధనశేఖర్, వెలిశెట్టి నరేంద్ర కుమార్, అడపా హరిబాబు, జడ్డు హరిబాబు, మద్దాన మాధవ్, ఎంపీటీసీ మార్లపూడి సుబ్బారావు, తదితరులు ఉన్నారు.

ఆక్రమణల తొలగింపు


గణేష్ నగర్ రోడ్డులో ఆక్రమణలను తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు

తాడేపల్లిగూడెం: పట్టణంలోని కోడేరు నల్లజర్ల రోడ్డుకు అనుసంధానంగా నిట్, నన్నయ్య క్యాంపస్, శశి కళాశాలు, గూడెం రూరల్ మండలంలోని పలు గ్రామాలకు అనుసంధానంగా గణేష్ నగర్ రోడ్డులోని ఆక్రమణల తొలగింపు ప్రక్రియకు మున్సిపల్ అధికారులు శ్రీకారం చుట్టారు. గణేష్ నగర్ నుంచి అప్పారావుపేటకు అనుసంధానంగా ఉన్న ఈ రోడ్డు ఎఫ్ఎంబీలో మాస్టర్ రోడ్డుగా ఉంది. దీని ప్రకారం వందడుగుల విస్తీర్ణంలో ఈ రహదారిని గతంలో విస్తరించడానికి చేసిన ప్రయత్నాలు వ్యాజ్యాల కారణంగా నిలిచిపోయాయి. ప్రధాన వస్త్ర కూడళ్లు ఈ ప్రాంతానికి సమీపంలోకి రావడం, నిట్ పశ్చిమ గేటుకు, ఇతర విద్యా సంస్థలకు ఇదే మార్గం శరణ్యం. రద్దీ ఉన్న ప్రాంతం కావడంతో రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు చోటు చేసుకున్నాయి. రోడ్డు విస్తరణకు ఇంకా అనుమతులు రాలేదు. వందడుగుల మార్గం కావడంతో ఆక్రమణదారులకు రెవెన్యూ అధికారులు నోటీసులిచ్చి తొలగించాల్సి ఉంది. తాత్కాలిక ఉపశమనం కోసం రోడ్డుకు ఇరుపైపులా ఆక్రమణలను మున్సిపల్ అధికారులు తొలగిస్తున్నారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు ఆక్రమణలను తొలగిస్తున్నామని, వందడుగుల మేర విస్తరణకు అనుమతి వచ్చాక తదుపరి ప్రక్రియ కొనసాగుతుందని కమిషనర్ మురళీకృష్ణ తెలిపారు.

కేన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించాలి


విద్యార్థినులకు శానిటరీ న్యాప్కిన్‌లను అందజేసిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: కేన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించడం వలన నియంత్రణ సాధ్యమని డైమండ్స్ లయన్స్ క్లబ్ డైరెక్టర్ కొత్త సుభద్ర అన్నారు. శనివారం మండలంలోని కొమ్ముగూడెం జిల్లా పరిషత్ హైస్కూలులో కేన్సర్, సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుభద్ర మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలను వినియోగించుకొని కేన్సర్‌ను తొలి దశలోనే గుర్తించడం మంచిదన్నారు. అలాగే, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. యుక్త వయస్సు బాలికలు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం బాలికలకు శానిటరీ న్యాప్కిన్‌లను అందజేశారు. డైమండ్స్ లయన్స్ క్లబ్ ప్రతినిధులు రమాదేవి, ఉపాధ్యాయులు అన్వేషి, శైలజ, బాలభారతి, విద్యార్థినులు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ


కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో హైమావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు

తణుకు అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో పర్యావరణ క్లబ్బులు ఏర్పాటు చేసి అమ్మవనం కార్యక్రమాన్ని నిర్వహించడం మంచి పరిణామమని ఎంఈవో ఎం.హైమావతి అన్నారు. మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఆమె తెలిపారు. తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూలు ఆవరణలో శనివారం నిర్వహించిన అమ్మవనం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పర్యావరణ క్లబ్బులోని విద్యార్థులు వారి తల్లితండ్రులచే మొక్కలను నాటించడం సంరక్షించడమే అమ్మవనం కార్యక్రమ ఉద్దేశ్యమన్నారు. మొక్కను నాటిన విద్యార్థులు ఆ మొక్కను బాధ్యతగా చూసుకోవడం కూడా శుభపరిణామమన్నారు. అనంతరం వంట వ్యర్థాల నిర్వహణ, మొక్కల పెంపకం, క్లాత్ బ్యాగ్స్ వాడించడం, పాఠశాల పరిసరాలు, ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీవైఈవో డి.మురళి సత్యనారాయణ, బయోలజీ కోఆర్డినేటర్లు జె.ఉమాదేవి, అక్కింశెట్టి రాంబాబు, బి.సులోచన, డేవిడ్‌రాజు పర్యవేక్షించగా ఉపాధ్యాయులు రాధ, మురళి, రాజకుమారి, జీజే ప్రభువరం, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో దోమలకు చెక్


పట్టణంలో అవగాహన ర్యాలీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): పరిసరాల పరిశుభ్రతతో దోమలకు చెక్ పెట్టొచ్చని మలేరియా సబ్ యూనిట్ హెల్త్ అధికారి వైవీ లక్ష్మణరావు అన్నారు. పట్టణంలోని బేబి సెంటర్ అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక 9,10, 11, 12 వార్డులలో ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ డెంగీ నివారణకు కలిసికట్టుగా కృషి చేద్దామని, దోమ లార్వా బ్రీడింగ్ ప్రదేశాలను కనుగొనుట, శానిటేషన్ సిబ్బందిచే కీటక నియంత్రణ చర్యలు చేపట్టడం, తదితర విషయాలపై చర్చించారు. డెంగీ జ్వర లక్షణాలను బట్టి చికిత్స అందిస్తూ ప్రాథమిక నిర్ధారణ పరీక్షలు పట్టణ ఆరోగ్య కేంద్రాలలో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఆరోగ్య కార్యదర్శులు వెంకటలక్ష్మి, మేరి, మంగతాయారు, పోసమ్మ, శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్ అంకెల గారడీ


మాట్లాడుతున్న మండల నాగేశ్వరరావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడీ మాత్రమేనని, రాష్ట్రానికి రూ 15 వేల కోట్లు అప్పుగా కాకుండా గ్రాంటుగా ఇవ్వాలని సీపీఐ పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు పేర్కొన్నారు. పట్టణంలోని కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో శనివారం నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో అందరికీ న్యాయం జరగలేదని చెప్పారు. పోలవరం జాతీయ ప్రాజెక్ట్ అయినప్పుడు రాష్ట్ర ప్రభుత్వంపై రుణభారం పెట్టకూడదని తెలిపారు. విభజన హామీలు నేటికీ అమలు కాలేదని చెప్పారు. కేంద్ర బడ్జెట్‌పై ఈ నెల 28, 29 తేదీలలో రైతు నిరసన నిర్వహించనున్నట్లు మద్దతు ప్రకటించాలని కోరారు. విజయవంతం చేయాలన్నారు. దాస్యం రాము, వడ్డది మేరీ, బొమ్మిడి కృష్ణ, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిషేధ చట్టంపై అవగాహన


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్


అవగాహన సదస్సులో పాల్గొన్న ఐసీడీఎస్ సిబ్బంది

పెంటపాడు: బాల్య వివాహాలు చేసినా, మహిళలను వేధించినా చట్టరీత్యా కఠిన శిక్షలు అమలులో ఉన్నాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత పేర్కొన్నారు. వల్లూరుపల్లి పాఠశాలలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఈ మిషన్ శక్తిపై బాలికలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత మాట్లాడుతూ ఫోక్స్ చట్టం,తదితర చట్టాలపై విద్యార్థినులు అవగాహన పెంచుకోవాలన్నారు. ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల అభివృద్ధికి సహకరించాలి

తణుకు టౌన్: బాలికలను బాలురతో సమానంగా చదివించాలని, బాలికల అభివృద్ధికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని తణుకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.అరుణకుమారి కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు పని చేసే ప్రదేశాలలో జరిగే వేధింపులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

100 రోజుల మిషన్ శక్తి

అత్తిలి: స్థానిక ఎస్వీఎస్ఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 100 రోజుల మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా బేటీ బచావో-బేటీ పఢావో కార్యక్రమాన్ని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.కుమారి మాట్లాడుతూ బాల్య వివాహాల నిషేధ చట్టపై మాట్లాడారు. ప్రిన్సిపాల్ ఎం.కృష్ణసాయి, ఏఎన్ఎం ఆశవర్కర్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై అవగాహన

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పెదతాడేపల్లి జిల్లా పరిషత్ హైస్కూలులో మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా శనివారం కొత్త చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్తేరు రాణి కొత్త చట్టాల గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కామేశ్వరి, సూర్యకుమారి, హరిప్రసాద్ పాల్గొన్నారు.